# ప్రళయాంతం

యండమూరి వీరేంద్రనాథ్

"**ఆకులో** దీపాలు పెట్టి నీళ్ళల్లో వదిలినట్టూ—సముద్రంలో ప్రమిదల్లా ఎన్ని పడవలో..."

"కోటను ముట్టడించటానికి శత్రు సైనికులు వస్తున్నట్టూ—చీకట్లో ఎంత నిశ్శబ్దంగా మన కొండవైపు వస్తున్నాయో."

"వాళ్ళు మన అతిథులే, పిచ్చి మొహమా! వాళ్ళని శత్రు సైనికులతో పోలుస్తావా?"

"అవును సుమాండీ. ఆ విషయమే మరిచిపోయాను" అందామె, కిటికీలోంచి బయట సముద్రంవైపు చూస్తూ. బయటంతా చీకటి. కొండమీద ఇల్లు అది. చుట్టూ సముద్రం.. సముద్రం ఈనినట్టూ పడవలు...మినుకు మినుకుమంటూ, చీమల్లా పాక్కుంటూ కొండవైపు వస్తున్నాయి దీపాలు.

"అంతమందికీ ఈ ఇల్లు సరిపోతుందా?"

"ప్రపంచం సరిపోకపోతే ఏం చేస్తున్నారు? ఇరుకు ఇరుగ్గా బతకటం లేదూ—అలాగే ఇల్లు సరిపోకపోతే ఒకళ్ళమీద ఒకళ్ళు కూర్చుంటార్లే..." అన్నాడు అతడు. అంతలో అతడి కంఠం మారిపోయింది. "అందరూ రావాలి. అందరూ వినాలి. రెండు లక్షల సంవత్సరాల అనుభవాల్ని పొందిగ్గా వ్రాసుకున్న నా జీవితపు డైరీలోంచి—ఈ ప్రపంచం కోసం, సకల మానవాళికోసం నేను చెప్పబోయే సందేశాన్ని అందరూ వినాలి."

"ఇది మరీ బాగు. రెండు లక్షల సంవత్సరాలా—అంత వయసు మీ కెక్కడిదండీ? నా వయసే లక్షా పాతిక వేలు లేందే..."

"అవునులేనేం? నువ్వు నా పెళ్ళానివి? నీకన్నా నేను పెద్దవాణ్ణి కాదూ!"

"కాదు. నేను మీ తల్లిని. మీకన్నా పెద్దదాన్ని..."

"కాదు, పెళ్ళానివి."

"కాదు—తల్లిని..."

"కాదు—పెళ్ళానివే."

'సర్లెండి. సర్లెండి. అతిథు లొచ్చే వేళ మనం ఇలా దెబ్బలాడుకుంటే బావుండదు."

"నే నీ రోజు వాళ్ళకేం చెప్పను. అందర్నీ వెళ్ళిపొమ్మను."

"మరి మీరేం జేస్తారు?"

"తల్లి నన్నావ్‌గా. కాళ్ళు జాచు. అండ పిండ బ్రహ్మాండంలో అణువున్నై, పరమాణువున్నై — ఎక్కడో సృష్టి నిశ్శబ్దంలో ముణగదీసుకుని హాయిగా పడుకుంటూ. ఈ ప్రపంచం ఎలా పోతే నాకేం!"

"అంత మాట అనకండి. మీ తండ్రి మీరే నాయె! మీ కొడుకూ మీరేనాయె. ఇన్ని లక్షల సంవత్సరాలు మీకు మీరే పుట్టీ పుట్టీ—ఆ కడుపులోంచే వచ్చీ వచ్చీ—ఆ కడుపులోనే సృష్టించీ సృష్టించీ—బాధాతప్తమయిన అనుభవాల్లోంచి సకల మానవాళికోసం తయారు చేసిన సందేశాన్ని వినిపించకుండా చిన్నపిల్లాడిలా అలిగితే ఎలా?"

"అవునుకదూ. నేను చెప్పాలి! ఇంతకీ అందర్నీ రమ్మన్నావా!"

"ఆ. ధనవంతుల్నీ, జ్ఞానుల్నీ, బుద్ధిమంతుల్నీ.."

"మునిసిపాలిటీవాళ్ళనీ, ప్రభుత్వం నడిపించే వాళ్ళనీ, ఆఫీసర్లనీ. వర్తకుల్నీ, కిళ్ళీకొట్టువాళ్ళనీ, టైపిస్టులూ గుమాస్తాలూ—అందర్నీ పిలిచావా?"

"రేడియోవాళ్ళు, ఎం. పీ.లూ, ఎం. ఎల్.ఏ.లూ, విప్లవకారులూ విప్లవ కళాకారులూ, పిచ్చి డాక్టర్లు—డాక్టర్ల దగ్గిరుండే పిచ్చివాళ్ళు, వేదాంతులు,నా.!. అందర్నీ పిలిచాను."

"మరి పత్రికలవాళ్ళూ, కవులువాళ్ళూ, ఛత్రాజులూ."

"ఆఁ. బాబాలూ, సన్యాసులు, జర్నలిస్టులు, తాగుబోతులూ, విమర్శకులూ, బుద్ధివున్నవాళ్ళూ, లేనివాళ్ళూ అందరూ వస్తారు. అందర్నీ పిలిచాను."

"మరి పోలీసులు?"

"వాళ్ళని పిలవక్కర్లేదు. వాళ్ళే వస్తారు."

"మరీ అంత కోపం తెచ్చుకోకు. అదేమిటి నీ చేతులు అలా వణుకుతున్నాయ్? ఈ ఏర్పాట్లు చేసీ చేసీనా?"

"అవును. పురుషుడ్ని సాకీ—సాకీ."

అతడు మళ్ళీ కిటికీలోంచి బైటకు తొంగి చూసేడు. సముద్రంమీద దట్టంగా మబ్బు పట్టింది. ఏ క్షణమైనా వర్షం కుంభవృష్టిగా మొదలయ్యేలా ఉంది. పడవలు ఇంకా వస్తూనే ఉన్నాయి. కొండ చేరుకున్న మనుష్యులు ఎక్కటం ప్రారంభించారు. పట్టు చీరల్లో ఉన్న వాళ్ళు, సూటుల్లో ఉన్నవాళ్ళు, ఖద్దరు బట్టలవాళ్ళు, అసలు బట్టల్లేని నూడిస్టు హిప్పీలు అందరూ వచ్చేస్తున్నారు. స్టీమర్లలో కొంతమంది దూరదేశంనుంచి వోడలో వచ్చి అక్కణ్ణుంచి లెద్ద పడవల్లో వచ్చేవాళ్ళు కొంతమంది, మొత్తం అన్ని వైపుల్నుంచీ ప్రపంచం అంతా కదిలి వస్తున్నట్టుంది.

అతడు తలతిప్పి—"నాకెందుకో భయంగా ఉంది" అన్నాడు. "నాకు భయమేస్తూంది. నా మనసులో మాట చెప్పలేనేమో. ఇంతమందిని చూస్తే నాకు గాభరాగా ఉంటుంది."

"ఏమీ పర్లేదండి. చెప్పవలసినదంతా ఒక పుస్తకంలో రాసుకోండి. వాళ్ళందరూ రాగానే దాన్ని చదివెయ్యండి—అంతే"

అతడు ఆమె వైపు బేలగా చూసి, "అంతేనంటావా?" అన్నాడు. ఆమె ధైర్యమిస్తున్నట్టూ "అంతేనండీ" అంది. అనికాగితాం దొంతర, కలమూ తెచ్చి ఇచ్చింది.

అతడు చాలాసేపు ఆలోచించి, వ్రాయటం మొదలుపెట్టాడు. ఆమె అతడి వైపు ఆప్యాయంగా చూస్తూ, "మీరూ రచయితలైపోయారు సుమా" అన్నది.

అతడు వ్రాయటంముగించికలం మూతపెట్టేశాడు.

"అదేమిటి — అప్పుడే అయిపోయిందా రాయటం?"

"ఎంత సేపే పిచ్చి మొహమా? వచ్చిన అతిథుల్ని మరీ దీర్ఘ ఉపన్యాసంతో బోరు కొట్టకూడదు."

"ఎంత గొప్ప వాళ్ళండీ మీరు! వేలవేల సంవత్సరాల మానవుడి గత చరిత్ర పుస్తకంలోంచి, భావి తరాల కోసం ఒకే వాక్యాన్ని తీసి ఇవ్వగలిగేరు."

అతడు ప్రేమతో, ఆర్తితో, ఆనందంతో, ఆనందం వల్ల వచ్చిన దుఃఖంతో తను వ్రాసుకున్న దాని వైపు చూసుకున్నాడు. "ఇంతకాలం నా గొంతు నొక్కి పట్టి ఉంచారు వాళ్ళు. తాము చెప్పటమే తప్ప నేను చెప్పేది విన్లేదు. అసలు నన్ను మాట్లాడనివ్వనే లేదు. ఇన్నాళ్ళకి నేను మాట్లాడబోతున్నాను. నా గుండెలో సంవత్సరాల తరబడి గూడు కట్టుకున్న వేదనంతా ఈరోజు మాటల రూపంలో చెప్పగలుగుతున్నాను! ఈ మాటల్ని కనుక్కున్న వాళ్ళెవరో గానీ, వాళ్ళకి నా జోహార్లు. మనసులో భావాల్ని బయటికి చెప్పటానికి ఎంత బాగా తోడ్పతాయి ఈ మాటలు!!"

"భలే వారండీ మీరు. ఈ మాటలా పొగుడుతున్నారు. ఈ మాటలు ఎంత భయంకరమైనవో మీకు తెలీదు. ఇవి బాణాలకన్నా సూటిగా గుండెలోకి దిగిపోతాయి. పురుగుల్లాంటి అక్షరాలు కలిసి మాటలవుతాయి. విమర్శకుల కలాల్లోంచి సృజనాత్మక పుటాలో చవ్లని భగ్నం చేసే ఆయుధాలవుతాయి. మైకుల్లోంచి రాజకీయ నాయకుని వాగ్దానాలవుతాయి. మనసునీ మనసునీ, మనిషినీ మనిషినీ దూరం చేస్తాయి ఈ మాటలే...ఈ మాటలే!"

అతడు హాయిగా నవ్వేడు. "కానీ ఈసారి నేను నిజంగా మాట్లాడబోతున్నాను. ఇన్నాళ్ళ నిశ్శబ్దం తరవాత నిజంగా నా మనసు విప్పి చెప్పబోతున్నాను. ఇంతకాలం వీళ్ళంతా నా గొంతు నొక్కిపట్టి ఉంచారు. అసూయ, ద్వేషం పగ, అనుమానం, ఈర్ష్య—అన్నిటికీ అతీతంగా వెళ్ళి ఆ అద్భుతమైన నిశ్శబ్దం నుంచి వెలువడిన ఓంకార శబ్దం లోంచి నాక్కావలసిన వేదాంతాన్ని తీసుకొని అందరికీ అర్థమయ్యేలా ఈరోజు చెప్పటానికి ఆయత్త

మవుతున్నాము. అందరూ వచ్చేస్తున్నారు. మళ్ళీ వచ్చేక తొందర పడ్తావేమో. ఇప్పట్నుంచే అవి సిద్ధం చేసుకున్నావా? ఎవరికి కావల్సినవి వాళ్ళకి..."

"మీరేం కంగారు పడకండి. అనీ సిద్ధంగానే ఉన్నాయి.

"వడ్డీ వ్యాపారస్తుల కోసం మనిషి రక్తం గ్లాసుల్లో పోసి ఉంచావా?"

"ఉంచాను."

"విప్లవకారుల కోసం తుపాకీ గుళ్ళు వాయినం?"

"ఆఁ. అవీ ఉన్నాయి."


మహిళా మండలి వాళ్ళ కోసం సేకరించిన రక రకాల వార్తా విశేషాలు."

"అవీ ఉనాయి. అంతేకాదు. శాడిస్టులకోసం పరాయివాళ్ళ జీవితపు నల్లమచ్చలు, మార్కిస్టుల కోసం పవిత్ర గ్రంథాల మీద బుడద."

"నువ్వు చాలా తెలివైన దానివిసుమా. నా మనసులో మాట బయటికి రాకుండానే అన్ని ఏర్పాట్లూ చేశావు."

"నా ఏర్పాట్లు సరే. మీరేమిటి—వాళ్ళు ఒకే వైపు వచ్చేస్తూ ఉంటే ఇంకా మీరు వ్రాసిన దాన్ని చూస్తూ మీలో మీరే అంత ఆనంద పడి పోతునారు?"

"ఇందులో నా వోన్ట్రాజెడీ నాకు కన



బడ్తాంది.''

ఆమె నవ్వి, ''హౌస్ ట్రాజెడీ అంటూ ఆనంద పడి పోతారేమిటండీ'' అంది.

బోసి పళ్ళతో అతడు నవ్వేడు. ''ట్రాజెడీలో ఆనందం లేదంటావా, ఆలోచించు. జీవితంలో ట్రాజెడీకి, కామెడీకి పెద్ద తేడా లేదు. ఒకప్పుడు ఎంతో దుఃఖం కలిగించిన సమస్య. జీవితపు పుటలో మిగిలి పోయి స్మృతిగా మారేక నవ్వు పుట్టించవచ్చు. ఒకరి ట్రాజెడీ ఇంకొకరికి కామెడీ కావచ్చు. లేక తన ట్రాజెడీ తనకే కామె...''

అతడి మాటలు ఇంకా పూర్తి కాలేదు. అంతలో ఎవరో తలుపు కొట్టినట్టయింది. క్షణంలో అది దబదబా బాదినట్టు శబ్దం. వేల వేల చేతులు తలుపుల్ని కొడ్తున్నాయి. ఎంతో ఆత్రంగా ఎంతో ఉద్వేగంగా—మరి ఆలస్యాన్ని భరించ లేనట్టు కొడ్తున్న ఆ చేతుల శబ్దాన్ని విని ఆ ముసలివాడు ఆనందంతో పొంగిపోయాడు. తన మాటలు వినటంకోసం, తను చెప్పేది గ్రహించటం కోసం ఎంత ఆత్రంగా ఉన్నారు ఈ అతిథులు.

సముద్రం నుంచి ఒడ్డుకొచ్చిన జనం, కొండ ఎక్కిన జనం ఇంకా వస్తూనే ఉన్నారు—తలుపులు దబడబా...

''ఒసేయ్! తియ్యవే తలుపులు... తొందరగా తియ్యి.''


''రావటం లేదండీ. కొంచెం నూనె తీసుకు రానా.''

''నూనేమిటే నీ మొహం. తులసి—తులసి తీర్థం తీసుకురా. ఎని వేల సంవత్సరాలైందో వీటిని వేసేసి. పవిత్రంగా తెరుద్దాం.'' అతడి మాటలు పూర్తయ్యేలోపులో ఆమె తులసి నీళ్ళు తీసు కొచ్చింది. ఇద్దరూ కలిసి ఎలాగైతేనేం, మనసు కవాటాల గడియ తీయగలిగారు....తలుపులు తెరుచు కున్నాయి.

అంతే !

ఉప్పెనలా...కట్టలు తెంచుకొని దూకిన వరదలా. జన ప్రవాహం లోపలికి ప్రవేశించింది. పెద్దలు, పిల్లలు, ఆడవాళ్ళు, పెళ్ళికావల్సినవాళ్ళు, పెళ్ళి అయినవాళ్ళు, పెళ్ళి అయి మొగుణ్ణి వదిలేసిన వాళ్ళు, మనసుతో సత్సంబంధాలు లేనివాళ్ళు, మొగవాళ్ళు, జీవితాన్ని తేలిగ్గా తీసుకొనేవాళ్ళు, ఎప్పుడూ ఏదో ఒక బాధతో కుమిలిపోయేవాళ్ళు, సైకిక్‌లు, పెటసిస్టులు, కాపిటలిస్టులు, మార్క్సిస్టులు, న్యూట్రలిస్టులు... అందరూ వచ్చే స్తున్నారు. చిన పిల్లలు, పాలుతాగే పిల్లలు కూడా పాక్కుంటూ వస్తున్నారు.

ముసలివాడు అందర్నీ చూసి ఆనందంతో ఉద్వేగంతో తబ్బిబ్బు అవుతున్నాడు. ''ఒసేయ్! ఇంకా కుర్చీలు తీసుకురా. అవి లేకపోతే తివాచీలు, దిళ్ళు, చాపలు... ఏవుంటే అవి...అయ్యో అలా తొక్కిసలాడుకోకండి. అంతా సర్దుకొని కూర్చో వాలి. అలా కిటికీమీద కొందరు కూర్చోండి.




వొద్దొద్దు. ఇంటి కప్పు ఎక్కకండి. ఆడవాళ్ళంతా ఒకవైపు మొగవాళ్ళంతా ఒకవైపు...అయ్యో— ఈ పిల్ల ఎవరో ఎక్కడ తడి చేసేసింది.''

జనం మధ్యలో అతడు చిక్కుకుపోయాడు. బోర్లా పడ్డాడు. నెమ్మదిగా లేవబోతూ వుంటే, ఎవరో తోసేరు. ఒక చెయ్యి డొక్కలో గుచ్చుకుని వెనక్కి పడ్డాడు. ''అయ్యో! నెమ్మది నెమ్మది'' అంటూ లేచి నిలబడ్డాడు. ఇంతలో పెద్ద బ్యాండు మేళం వినిపించింది. మంత్రిగారు కూడా వచ్చే సేరు. జనంలో కలకలం బయల్దేరింది. ముసలి వాడు—''మంత్రిగార్ని మీరెప్పుడూ చూడలేదా?'' అంటూ అదిలించి, ఆయనవైపు తిరిగాడు.

''హో ప్రజా ప్రతినిధి! రాక రాక జనంమధ్యకి వచ్చిన మీకు ఇదే మా హృదయపూర్వక స్వాగతం.''

''మహాప్రభూ! ఇన్నాళ్ళకి మామీద దయ కలిగిందా?'' అంది ముసలమ్మ.

''మేం చెప్పింది విని అర్థం చేసుకొని, పాలిం చటం మొదలుపెడితే ఈ ప్రపంచంలో బాధ లుండవు. యుద్ధాలుండవు. విషాద గాథలుండవు'' అంటూ అతడు కిటికీ ఎక్కాడు. అక్కణ్ణుంచి అతడు అందరికీ స్పష్టంగా కనబడుతున్నాడు. ఇంకొకవైపునుంచి అతి కష్టంమీద జనంలో చోటు చేసుకుంటూ ముసలమ్మ కూడా అక్కడికి వచ్చింది. అక్కడ కూడా జనం వాళ్ళని నొక్కేస్తున్నారు. అయితే వాళ్ళు ఎత్తుమీద ఉండటం వల్ల జనంలో మాటలు తగ్గి, వాళ్ళవైపే చూడటం మొదలుపెట్టారు.

సముద్రంలో పడవలు ఇంకా వస్తున్నాయి. జనం ఇంట్లోకి రావటానికి ప్రయత్నిస్తున్నారు. బాగా ఉరుముతూంది. ఆ రాత్రి కాళరాత్రిగా మారేట్టు ఉంది.

''వినండి—అందరూ వినండి.'' గొంతు పగిలేలా అరిచేడు ఆ ముసలివాడు. ''ఇన్నాళ్ళూ నన్ను నొక్కిపట్టిన మీ చేతుల్ని ఛేదించుకొని, ఈ క్షణం నా గొంతు మాట్లాడబోతూంది. వినండి.''

ప్రకృతి కదిలిపోయింది. ఆకాశం విస్తు బోయింది. మేఘం పరుగెత్తటం ప్రారంభించింది. పడవలో వాళ్ళు కూడా సముద్రం మధ్యలో ఆగిపోయి, అక్కణ్ణుంచే అతడు చెప్పేది విన సాగేరు.

''ఇది నా సందేశం. వేదకాలంనుంచీ ఆధునిక యుగంవరకూ వేల వేల సంవత్సరాలు జీవించి నేను నేర్చుకున్న పాఠం ఇది. నాకుతోడుగా ఈ ప్రకృతి'' అంటూ ముసలమ్మని చూపించి, ఆమెవైపు తిరిగి, ''నీకు నా కృతజ్ఞతలు'' అంటూ అభివందనం చేసేడు.

''భార్యకు నమస్కారంపెడ్తున్నాడ్రోయ్'' అన్నా డెవరో. గొల్లుమని నవ్వులు. దాన్ని ఆ ముసలివాడు పట్టించుకోలేదు. ''జనులారా! నేను చెప్పేది వినండి. కుల మత వయో తారతమ్యం లేకుండా, మనిషికీ మనిషికీ మధ్య తెరల్ని తొలగించేటందుకు నేను చెప్పబోయే ఈ కొద్ది మాటల్ని—మీ మీ హృదయ కవాటాలు తెరిచి జాగ్రత్తగా వినండి. టు నైవ్ ఆఫ్ ది కమ్యూనికేషన్ గాప్— అండ్ ది జనరేషన్ గాప్...''

కిటికీ పక్కనే నిల్చున ఆకతాయి కుర్రవాడు ఆ ముసలివాడి కాలు పట్టుకొని లాగేడు. అతడు కిందపడబోయి కిటికీ తలుపు పట్టుకొని నిల దొక్కుకుంటూ అరిచేడు. ''ఓం అనే మాటలోంచి ప్రపంచం పుట్టిందంటారు. ఆ 'ఓం' ని చిత క్కొట్టి అనేక మాటలు పుట్టాయి. మాటలకు పునాదులు చేతలు. చేతల వల్ల విభేదాలు. దానివల్ల ఉత్పన్నమయ్యే బాధామయ జీవితం నుంచి మని షిని రక్షించే మార్గం నేను కనుక్కున్నాను. ఇదిగో ఈ పుస్తకంలో వ్రాసుకున్నాను. దాని చదివి విని పిస్తాను. అయ్యో! వినండి. ఈ రచయిత చెప్పేది మేం వినటం ఏమిటని కొట్టి పడెయ్యకండి!

ఎన్నో సంవత్సరాలనించి మేమిద్దరం ఈ గదిలో బంధించుకొని ఉన్నాం. మనిషి జీవితపు మెటాఫిజికల్ ఎమ్టీనెస్—తత్వజిజ్ఞాసాత్మకశూన్యత ఒంటరి తనం—నుంచి బయట పడాలనే తాపత్ర

యం ఇది. ఈ నిశ్శబ్దాన్ని ఛేదించాలి. ఈ నిశ్శబ్దం వల్లే మనిషికీ మనిషికీ వర్గానికీ వర్గానికీ, దేశానికీ దేశానికీ మధ్య దూరం పెరిగిపోతూంది.

లేవగానే టూత్ బ్రష్ నుంచి, పడుకునేటప్పుడు వేసే బెడ్‌లైట్ వరకూ మనిషి జీవితంలో ప్రాణం లేని వస్తువుల ప్రాబల్యం ఎలా పెరిగిపోతూ ఉందో.. ఈ గదిలోకి వస్తున్న అనేకానేక జీవులు తదాత్మ్యం లేకుండా అలానే పెరిగిపోతున్నారు.

చరిత్రలో ప్రతి సారీ ఒక మహనీయుడు గానీ, ప్రవక్తగానీ 'నేనో సందేశం చెబ్తాను ..వినండి' అన్నప్పుడెల్లా మొత్తం జనావళి అటు తిరగటం— సందేశం అర్థం చేసుకోకుండానే అతడిని చంపెయ్యటం అనాది నుంచీ జరుగుతూ వస్తూంది. జనులారా! నేను ఈరోజు చెప్పదల్చుకున్నది. "ఏమీ లేకపోవటం" గురించి. అవును. నథింగ్‌నెస్ గురించి!!!

నేను చెప్పదల్చుకున్నది. మనిషి ఒంటరి తనం గురించీ ముసలితనపు వోడిపోవటం గురించీ కాదు. కానీ నేను చెప్పబోయేదీ — చెప్పాలనుకున్నదీ — మీకు చేరేసరికల్లా దాని అర్థం మారిపోతూంది. నా గొంతు కండరాల కదలికలు — గాలిలో శబ్ద తరంగాలై మీ చెవుల ద్వారా మెదడు చేరేసరికి వాటి అర్థం— అపార్థం అవుతుంది. ఆ అపార్థమే క్రీస్తుని చంపింది. హిరోషిమా మీద బాంబులు కురిపించింది.

ఈసారి అలా కావటానికి వీల్లేదు. అందుకే నేను వ్రాసుకున్నాను దీన్ని! అపార్థాలకి చోటు లేకుండా చదివి వినిపిస్తాను. అందరూ వినండి."

జనం నిశ్శబ్దంగా ఉన్నారు. కొన్ని కోట్ల మంది ఉన్నా అక్కడ సూది పడ్తే వినబడేటంత నిశ్శబ్దం. ముసలివాడు పుస్తకం విప్పేడు. ఆమె అతడి వైపే చూస్తూంది. అతడు కిటికీలోంచి బయట సముద్రంలోకి పడిపోకుండా పట్టుకొంది. అతడు తను వ్రాసిన దాని వైపే చూస్తున్నాడు. అందరూ అతడు చెప్పే దాని కోసం వేచి ఉన్నారు.

"ఉ...అర్‌ర్...న్...ఇన్‌న్...''

అతడు మాట్లాడడానికి ప్రయత్నం చేస్తున్నాడు. కానీ మాటలు రావటం లేదు. అస్పష్టమైన ధ్వని వెలువడుతూంది. సైన్ లాంగ్వేజి ఉపయోగించ బోయాడు. లాభం లేకపోయింది. కళ్ళ నమ్మట నీళ్ళొచ్చాయి. ఆమె అతడి వైపు జాలిగా చూస్తూంది. అతడు కిటికీ రెక్క మీద సుద్ద ముక్కతో వ్రాయటానికి ప్రయత్నించాడు. అది అర్థం లేని వ్రాత అయింది. మళ్ళీ మాట్లాడడానికి శుష్క ప్రయత్నం చేశాడు. ఈ లోపులో ఎవరో కుర్రవాడు నవ్వేడు.

అంతే!

ఒక్కసారిగా ఆ గది అంతా నవ్వులు. గోల. వెక్కిరింతలు. ప్రపంచం అంతా గోలగోలగా అరవసాగింది. గది ఆ కేరింతలకి కంపించిపోయింది. ముసలివాణ్ణి ఎవరో వెనక్కి తోసేరు. అతడు చేతిలో పుస్తకాన్ని లాక్కొన్నారెవరో. ఆమె అతడిని రక్షించటానికి ప్రయత్నం చేస్తూంది. అయినా లాభం లేకపోయింది. ఆ ప్రజా వెల్లువని రెండు బలహీనమైన చేతులు ఆపు చెయ్యలేక పోతున్నాయి. ఎవరో అరటి పండు తొక్క విసిరేశారు. ఇంకొకళ్ళెవరో బాకా వూదుతున్నారు. ఒక యువకుడు పక్కనున్న ఆడపిల్ల చెవి పిన్ను లాగి దాంతో ముసలివాడి కాలిని గుచ్చాడు.

ఒక బాధా తప్తమైన అరుపుతో పట్టు జారి ముసలివాడు కిటికీలోంచి కొండ మీదగా జారి సముద్రంలోకి పడిపోయాడు. అతడి విష్క్రమణని ఎవరు పట్టించుకోలేదు. అంతా రణగొణ ధ్వని. అతడి చేతిలోంచి లాక్కున్న పుస్తకంలోని కాగితాలు చింపుతున్నారు జనం. జోకులేసుకుంటూ నవ్వుకుంటూ, ఆ కాగితాల్లో ఏం వ్రాశాడో చూడటానికి ఒక్కో కాగితాన్నే చూస్తూ పక్కన పడేస్తున్నారు. అన్ని కాగితాలూ తెల్లగానే ఉన్నాయి. వాళ్ళకి అర్థం కాలేదు. ఒకరొకరే వెళ్ళిపోసాగేరు.

తొందర్లోనే గది ఖాళీ అయింది. వెళ్ళిపోతున్న పడవం దీపపు కాంతి చీకట్లో నెమ్మది నెమ్మదిగా అదృశ్యమయింది.

గది నిండా తెల్లకాగితాలు.

వాటి మధ్యలో ముసలమ్మ మోకాళ్ళ మీద కూర్చుని ఏడుస్తూంది. ★

**(ఈ అబ్సర్డ్ కథకి ప్రేరణ ఒక అనిబద్ధ రచయిత)**




RADEUS/PE/L/17-82